# పెనుగులాట

**"పద్మజ లేదా?" అంటూ రమణ లోనికి దూసుకొచ్చాడు. రమణను చూసి ప్రశాంత్ నుదురు చిట్లించాడు. ముఖం కాస్త నల్లబడింది. తనలో ఆకస్మాత్తుగా వచ్చిన వికారాలు కనిపించకుండా ప్రయత్నిస్తూ "ఉంది కూర్చో" అని చెప్పాడు ప్రశాంత్.**



రమణ దర్జాగా కూర్చున్నాడు. రమణ అంత స్వతంత్రంగా వచ్చి పద్మజ గురించి అడగడం, బెరుకులేకుండా కుర్చీలో కూర్చోవడం ప్రశాంత్‌కు నచ్చలేదు. బెడ్ రూమ్‌లోకి వెళ్లి "రమణ వచ్చాడు" అని విసుక్కున్నట్లు చెప్పాడు పద్మజతో. ఆ విసుగును కనిపెట్టిన పద్మజ అతనివైపు చురుగ్గా చూసింది. చురకత్తిలా తాకిన ఆ చూపులకు ప్రశాంత్ ముఖం దించుకున్నాడు. అద్దంలో చూసుకుంటూ నుదుటి మీది బొట్టు బిళ్లను సరిచేసుకుని బయటకు వచ్చింది.

"హాయ్, రమణా! ఎలా వున్నావు?" అని అడిగింది చొరవగా.

ప్రశాంత్ లోపల బెడ్ మీద వాలిపోయాడు. వాళ్లిద్దరి మాటలను జాగ్రత్తగా వింటున్నాడు. వారి కదలికలను ఊహించుకుంటున్నాడు. వాడ్ని చూడగానే అంత చలాకితనం వచ్చేస్తుంది ఈవిడకి అని తిట్టుకున్నాడు.

"ఏంలేదు, పనివుండి ఇటు వచ్చాను, మీ ఇల్లు ఇక్కడే కదా చూసి పోదామని వచ్చాను" చెప్పాడు.

వాడికి ఈ ఏరియాలోనే ఎక్కడలేని పనులుంటాయి కాబోలు, ఎప్పుడుపడితే అప్పుడు రావడానికి అదో సాకు అని అనుకున్నాడు ప్రశాంత్ మనసులోనే. గుండె కుతకుత ఉడికిపోతోంది.

"ప్రశాంత్ ఏం చేస్తున్నాడు?" అడిగాడు.

"వస్తాడుండు" అంది.

ఎంతకీ ప్రశాంత్ బయటకు రాకపోవడంతో రమణే బెడ్‌రూమ్‌లోకి అడుగు పెట్టాడు. ప్రశాంత్ పడుకుని వుండడం చూసి ఆశ్చర్యపోయాడు. "ఏరా పడుకున్నావు? బయటకు రావచ్చుకదా!" అన్నాడు రమణ.

"కొంచ తలనొప్పిగా వుంది. మీరు మాట్లాడుతూ వుండండి" అని చెప్పాడు. రమణకు ఏమీ అర్థంకాక కాసేపు అలాగే నిలబడి బయటకు వచ్చేశాడు.

రమణ, పద్మజ కబుర్లలో పడ్డారు. ప్రశాంత్‌కు చిరాకు క్షణక్షణానికి పెరిగిపోతోంది. స్థిమితంగా వుండలేకపోతున్నాడు. లేచి బయటకు వచ్చాడు. వాళ్లిద్దరినీ చూశాడు. ఎదురెదురుగా కూర్చున్నారు. చెప్పులు వేసుకుంటుంటే పద్మజ గమనించి "ఎక్కడికి?" అని అడిగింది.

గొంతులో ఏమాత్రం విసుగు, కోపం ధ్వనించకుండా జాగ్రత్తపడుతూ- "ఇప్పుడే వస్తా" అంటూ వెళ్లిపోయాడు. పద్మజ ముఖం వివర్ణమైంది. రమణ లేచి ప్రశాంత్ వెనకే వెళ్లాడు. "ఏరా నేను వస్తే నువ్వెళ్లిపోవడమేమిటి?" అన్నాడు.

"ఇప్పుడే వస్తా" అని పొడిగా అనేసి వెళ్లిపోయాడు.

రమణకు ఏదో అర్థమై కానట్టుగా వుంది. లోపలికి వచ్చి "ఏమైనా గొడవ పడ్డారా?" అని అడిగాడు.

"అబ్బే, అదేంలేదు. సిగరెట్ల కోసం వెళ్లాడేమో" అంది తొట్రుపాటును అణచుకుంటూ.

రమణకెందుకో పద్మజ మాటలను నమ్మాలనిపించలేదు.

కాసుల ప్రతాప్‌రెడ్డి

రమణ, ప్రశాంత్, పద్మజ యూనివర్సిటీలో క్లాస్‌మేట్స్. ఒక విప్లవ విద్యార్థి సంఘంలో కలిసి పనిచేశారు. మంచి మిత్రులు కూడా అయ్యారు. ఈ కారణంగానే రమణారావు రమణగానూ, ప్రశాంత్‌రెడ్డి ప్రశాంత్‌గానూ మారిపోయారు. ఉద్యమంలో కలిసి పనిచేస్తున్న క్రమంలోనే పద్మజ, ప్రశాంత్ ప్రేమించుకున్నారు.

> **తాను ఏమాత్రం ఒత్తిడి చేయకుండానే ఆమె తనకు అనుకూలంగా మారిపోవాలనేది అతని కోరిక. ఆలోచన మాత్రం అందుకు విరుద్ధమైంది. ఇవన్నీ పద్మజ బుద్ధికి తట్టనివిషయాలు.**

వీరిద్దరినీ రమణ ప్రోత్సహించాడు కూడా. కట్నకానుకలేవీ లేవు. స్టేజీ మ్యారేజీ. ప్రశాంత్, పద్మజల పెళ్లంటే విద్యార్థి సంఘం కార్యకర్తలందరికీ ఒక పెద్ద సంరంభం. సంప్రదాయాన్ని బద్దలు కొడుతూ జరుగుతున్న ఈ పెళ్లి ఉద్యమానికి ఒక ముందడుగు. ఉస్మానియా యూనివర్సిటీలోని టాగోర్ ఆడిటోరియం వేదిక. బ్రాహ్మణుడి స్థానంలో పెళ్లి పెద్ద, ఇంకో ఇద్దరు స్పీకర్లు, కాబోయే భార్యాభర్తలు స్టేజీ మీద, చుట్టాల స్థానంలో కార్యకర్తలు. ఈ పెళ్లి ఇష్టంలేక ఇరువైపుల నుంచీ తల్లిదండ్రులు రాలేదు. తాపీ ధర్మారావు 'పెళ్లి పుట్టుపూర్వోత్తరాలు' పుస్తకంలోని విషయాలు ప్రస్తావిస్తూ పెళ్లి పెద్ద అనర్గళంగా ఓ గంటసేపు మాట్లాడాడు. ప్రశాంత్, పద్మజల చేత దండలు మార్పించి, ప్రమాణం చేయించాడు. మిగతా వక్తలు కూడా ఎవరూ గంటకు తక్కువ కాకుండా మాట్లాడారు. ప్రసంగానికి ప్రసంగానికి మధ్య విప్లవ గేయాలు. సభకు ఇవి ఊపునిచ్చాయి. పెళ్లికి వచ్చిన వారికి బిస్కెట్లు ఇచ్చి టీ పోశారు. పాత సంప్రదాయం స్థానంలో కొత్త సంప్రదాయాన్ని నెలకొల్పారు. మరో విశేషమేమంటే పద్మజ, ప్రశాంత్‌లది కులాంతర వివాహం కూడా. అక్కడున్న వారందరికీ సమాజంలో గొప్ప మార్పు వచ్చిన ఫీలింగ్. ప్రస్తుత సమాజాన్ని కాలదన్ని కొత్త సమాజానికి బాటలు వేసిన విజయ గర్వం. ఉత్సాహ ఉద్వేగాలు వాతావరణాన్ని సంబరంగా మార్చాయి. 'కదం తొక్కుతూ పదం పాడుతూ హృదంతరాళం గర్జిస్తూ...' అన్నంత ఉద్వేగం. జీవన సహచరులుగా మారిన ప్రశాంత్, పద్మజలు ఓ ఏడాదిపాటు ఉద్యమంలో తిరిగారు. ప్రశాంత్ రచయితల సంఘంలోనూ, పద్మజ మహిళా సంఘంలోనూ పనిచేశారు. వాడివేడి చర్చలు, సభలు, సమావేశాలు, పోస్టర్లు అతికించడాలు, కరపత్రాలు రాసి, పంచిపెట్టడాలు క్షణం తీరికలేకుండా కాలం గడిచిపోయింది. రోజుకు 24 గంటలు కూడా సరిపోయేది కాదు.

ఆ తర్వాత ప్రశాంత్‌కు యూనివర్సిటీలోనే లెక్చరర్ పోస్టు వచ్చింది. పద్మజ ఇంకా మహిళా సంఘంలోనే పనిచేస్తోంది. దాంతో ఆమెకు క్షణం తీరిక వుండేది కాదు. ఎప్పుడూ ఎవరో ఒకరు రావడం చర్చలు జరపడం, ఏదో సమస్యను తీసుకురావడం ఆ సమస్య పరిష్కారానికి వీధులకెక్కడం పరిపాటి అయింది. ప్రశాంత్ కాలేజీలో పాఠాలు చెప్పడమే కాకుండా వక్తగా మీటింగ్‌లకు వెళ్లసాగాడు. ఉద్యమంలో వారి స్థాయి పెరిగినట్లే ఇంట్లో వస్తువులు సమకూరాయి. కానీ, ఇద్దరి మధ్య ఎడం పెరుగుతూ వచ్చింది. చాలాకాలం ఈ విషయాన్ని వారు పట్టించుకోలేదు.

ప్రశాంత్‌లో ఏదో తీవ్రమైన అసంతృప్తి మొదలైంది. తనకు ప్రయివేట్ టైమ్ అంటూ వుండదా అనే ఆలోచన మొదలైంది. పద్మజ మీద ఏదో చెప్పలేని అసహనం పెరగసాగింది. చాలామంది ఆమెకు సన్నిహితంగా వుండడం అతనికి నచ్చలేదు. ప్రశాంత్‌లో వచ్చిన మార్పును పద్మజ గుర్తించలేదు. గుర్తించే అవకాశం కూడా లేదేమో!

ప్రశాంత్ ఎంతకీ తిరిగి రాకపోయేసరికి రమణ వెళ్లిపోయాడు. పద్మజ సరేనంది. పద్మజకు ఏదో గుండెలో గుబులుగానే వుంది. ప్రశాంత్ ఈమధ్య తనతో ముభావంగా వుంటున్నాడు. అప్పుడప్పు




డు చిరాకుపడుతున్నాడు కూడా. తాను మీటింగ్‌ల గురించి చెప్పబోతే పట్టించుకోవడంలేదు. చాలాసేపటికి ప్రశాంత్ వచ్చాడు. రమణ గురించి ఏమీ అడగలేదు. ఆమె చెప్పనూలేదు.

ప్రశాంత్ మనసు మనసులో వుండడంలేదు. ఎవరిని పడితే వారిని, ఏ వేళ పడితే ఆ వేళ ఇంట్లోకి రానీయవద్దని, అందరితో కలుపుగోలుగా మాట్లాడవద్దని పద్మజకు చెప్పి ఒప్పిస్తే సమస్య పరిష్కారమవుతుందని అతనికి తెలుసు. ఆ విషయం నేరుగా చెప్పలేదు. తాను ఏమాత్రం ఒత్తిడి చేయకుండానే ఆమె తనకు అనుకూలంగా మారిపోవాలనేది అతని కోరిక. ఆలోచన మాత్రం అందుకు విరుద్ధమైంది. ఇవన్నీ పద్మజ బుద్ధికి తట్టని విషయాలు. పెళ్ళికి ముందు ఎంత స్వతంత్రంగా వుండేదో ఇప్పుడు అదే స్వతంత్రం వుందని ఆమె అనుకుంటోంది. అలాగే వ్యవహరిస్తోంది.

** ** **

ఆరోజు సాయంత్రం ఐదు గంటలకే ప్రశాంత్ ఇంటికి వచ్చాడు. ఇంటికి తాళంవేసి వుంది. తాళం తీసి ఇంట్లో అడుగుపెట్టాడు. నిరాశ చుట్టుముట్టింది. షూస్ తీసేసి బెడ్‌పై వాలిపోయాడు. అలసటగా వుంది. కానీ, నిద్రపట్టడంలేదు. ఒంటరితనం ఆవరించింది. ర్యాక్‌లోంచి ఓ పుస్తకం అందుకున్నాడు. మొదటి పేజీ చదివాడు. విసుగేసింది. దాన్ని పక్కన పడేసి కళ్లు మూసుకున్నాడు. మెల్లగా లేచి టీ కాచుకుని తాగాడు. సిగరెట్టు ముట్టించాడు. గదినిండా పొగ రింగురింగులుగా, మెదడులో ఆలోచనల్లా. రానురాను జీవితం మీద అసంతృప్తి పెరిగిపోతోంది. తాను తప్పుగా ఆలోచిస్తున్నానా అని ప్రశ్నించు కున్నాడు. బహుశా తప్పే కావచ్చు అని మెదడును బుజ్జగించే ప్రయత్నం చేశాడు. అది మాట వినడంలేదు. పద్మజ ఇప్పుడు ఎక్కడ వుండి వుంటుంది. పార్టీ ఆఫీసులో గప్పాలు కొడుతోందేమో, ఈవిడకు చర్చలు తెగవు. మాట్లాడే విషయాలు మాట్లాడేసి ఎవరి దారిన వారు పోకుండా మధ్యమధ్యలో జోక్‌లు, నవ్వుకోడాలు, టీలు తాగడాలు వుంటాయి.

వారందరి మధ్య తాను లేకుండా పద్మజ వుండడం తనకు నచ్చడంలేదు.

ఆలోచనలతోనే టైమ్ గడిచిపోతోంది. బయట చప్పుడైంది. అంటే పద్మజ వచ్చిందన్నమాట అనుకున్నాడు. రిస్ట్‌వాచీ చూసుకున్నాడు తొమ్మిదయింది. లైట్ వేసి "ప్రశాంత్!" అని పిలిచింది. ఆ పిలుపునకు బదులివ్వకుండా లేచి బయటకు వచ్చాడు. "లైట్ కూడా వేసుకోలేదేం?" అని అడిగింది. ఆమెలో ఉత్సాహం. ఏమాత్రం అలసిపోయినట్లు కనిపించడంలేదు. అంటే, తను లేకున్నా ఆమె అదే ఉత్సాహంతో వుంటుందన్నమాట అనుకున్నాడు. జవాబివ్వలేదు. "ఒంట్లో బాగాలేదా?" అని అడిగింది. బ్యాగ్‌ను టీపాయ్ మీద గిరాటేస్తూ. దీనికి సమాధానం ఇవ్వలేదతను. అతను మాట్లాడక పోవడాన్ని ఆమె పెద్దగా గుర్తించినట్లు లేదు. చకచకా బాత్‌రూమ్‌లోకి వెళ్లి స్నానం చేసి వచ్చింది. అతను బెడ్‌పై ఒరిగిపోయాడు. తల దువ్వుకుంటూ "అన్నమేమైనా వుందా?" అని అడిగింది.

"నేను చూడలేదు" అన్నాడు పొడి పొడిగా.

ఆమె డైనింగ్ టేబుల్ మీది గిన్నెలన్నీ చూసింది. ఏమీలేదు. అక్కడినుంచే- "ఆకలి వేయడంలేదా? కొంచెం వండుకుని తినొచ్చుకదా!" అంది.

ప్రశాంత్ నోరు విప్పలేదు.

"నేనే మాట్లాడుతున్నాను. ఒక్క మాటయినా మాట్లాడవేం. జ్వరం వుందా?" అంటూ దగ్గరకు వచ్చి నుదుటి మీద చేయివేసి చూసింది.

"జ్వరమేమీ లేదు. మరి ఎందుకలా వున్నావు?" అని అంది.

"ఏంలేదు" అని అన్నాడు.



గుండెలోని దుఃఖం బయటకు తన్నుకొని వస్తోంది. బలవంతంగా నిగ్రహించుకుంది. ఆమె ప్రతి కదలికనూ ప్రశాంత్ గమనిస్తూనే వున్నాడు. అతనికి హృదయాన్ని మెలిపెట్టి తిప్పుతున్నట్లుగా వుంది. ఒక్కసారి వెళ్లొద్దని చెప్తే అనుకున్నాడు. కానీ చెప్పలేకపోయాడు. మసకమసక చీకటి వుండగానే ఆటోను పిలిచింది.

ఆమె వంట పనిలో నిమగ్నమైంది. వంటచేసేసరికి మరో గంట పట్టింది. ప్రశాంత్‌ను పిలిచింది. ప్రశాంత్ లేచి బట్టలు మార్చుకుని ముఖం కడుక్కుని వచ్చాడు. ఇద్దరూ డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నారు. భోజనం చేస్తూ ఆమె మాట్లాడుతూనే వుంది. అతను మౌనంగా వింటున్నాడు.

"నేనింత వాగుతుంటే ఒక్కమాట మాట్లాడవేం?" అని అడిగింది.

"ఏం మాట్లాడాలి?" అని అడిగాడు ముక్తసరిగా.

"నువ్వేదో తీవ్రంగా ఆలోచిస్తున్నావు. ఏమిటో నాకు చెప్పొచ్చుకదా!" అంది.

"నువ్వు ఆ మహిళా సంఘం కార్యక్రమాలు తగ్గించుకోవచ్చుకదా!" అని ఆమె ముఖం చూశాడు. ఆమె ముఖం రంగులు మారడం కనిపించింది.

"ఎందుకు?" అని అడిగింది.

"నాకు నచ్చడంలేదు" అన్నాడు. మాట ఎక్కడో లోతు నుంచి వచ్చింది. స్థిరంగా కూడా చెప్పలేకపోయాడు.

"ఒక్కమాట చెప్పనా? నేను స్వతంత్రంగా వుండడం, వ్యవహరించడం నీకు నచ్చడంలేదు.రమణ వచ్చిన రోజు నువ్వు ప్రవర్తించిన తీరే ఆ విషయాన్ని పట్టించింది. రమణ నీకు ఫ్రెండే కదా, నువ్వలా వెళ్లిపోయినందుకు అతనెంత బాధపడ్డాడో తెలుసా? ఒక్క రమణే కాదు, ఎవరొచ్చినా నువ్వు అలాగే ప్రవర్తిస్తున్నావు. నీతో మాట్లాడ్డానికి ఎవరైనా వస్తే నీ ధోరణి వేరే రకంగా వుంటోంది" అని అంది.

"వాడలా రావడం నాకు ఇష్టంలేదు" అన్నాడు.

"అతను రావడం ఇష్టంలేదా? అతను నాతో మాట్లాడడం ఇష్టంలేదా?" అని అడిగింది ప్రశాంత్ కళ్లలోకి సూటిగా చూస్తూ.

అతను తలదించుకుని అన్నం ముద్ద నోట్లో పెట్టుకున్నాడు. ఏమీ జవాబివ్వలేదు.

"నువ్వూ అందరిలాంటి మగాడివే. నువ్వు ఉద్యమాల నుంచి నేర్చుకుంది ఏమీలేదు" అంది.

"అంటే నీ ఇష్టం వచ్చినట్లు నువ్వు తిరుగుతావు. నన్ను పట్టించుకోవు" అన్నాడు ఫిర్యాదు చేస్తున్నట్లు.

"నిన్ను నేను పట్టించుకోవడమేమిటి? ఇద్దరం కలిసి బతుకుతున్నాం కాబట్టి ఒకరినొకరం పట్టించుకోవాలి" అంది.

"నువ్వేదో నాకు దూరమైనట్లు అనిపిస్తున్నావు"

"నువ్వు ఊహించుకుంటున్నావు. నువ్వు కోరుకునేది వేరు. దాన్ని స్పష్టంగా చెప్పలేవు. అందుకని అడ్డదారిలో వస్తున్నావు" అంది కోపంగా.

అతను మాట్లాడలేదు.

"మామూలు భార్యాభర్తల్లా మనం కొట్లాడుకుంటూ కాపురం చేయడం అనవసరం. రేపట్నుంచి ఎవరి దారి వారు చూసుకుందాం. నేను ఈ ఇంట్లోంచి వెళ్లిపోతాను" అని ప్లేట్లోనే చేయి కడిగేసి లేచింది. రాత్రంతా ఆమె చదువుకుంటూ కూర్చుంది. అతను పడుకున్నాడు. కానీ నిద్రపోలేదు. ఇద్దరి మధ్యా మాటలు లేవు.


**రూ. 21,00,000/-ల విలువగల బహుమతులు గెలవండి - ఎంట్రీఫీజు లేదు**

| ఉదాహరణ | | |
|---|---|---|
| 4 | 9 | 8 |
| 11 | 7 | 3 |
| 6 | 5 | 10 |

1వ బహుమతులు - టాటాసుమో - (ఇద్దరికి)

2వ బహుమతులు - హీరోహోండా, (ఎనిమిది మందికి)

కన్సొలేషన్ బహుమతులు - వెస్పాస్కూటర్, సి.డి. ప్లేయర్, కలర్ టి.వి., ఆటోమేటిక్ కెమెరా, ఎయిర్‌కూలర్, వాషింగ్ మెషిన్, టు-ఇన్-వన్ (పథకం MB&HP క్రింద)

| | | |
|---|---|---|
| 5 | | |
| | 8 | |
| | | 11 |

★ మొదటి 200 సరైన ఎంట్రీలకు ఒక్కొక్కరికి 4 గ్రాముల ఒక బంగారు నాణెం

★ పైన తెలిపిన విధంగా, తెల్లకాగితం మీద లేదా ఇన్‌లాండ్ లెటర్‌పై లేదా పోస్టుకార్డుపై 9 ఖాళీ చతురస్రాలు గీయండి. 4 నుంచి 12 అంకెలు వాడుతూ ఏ కోణం నుంచి కూడినా 24 వచ్చేలా చూడండి. ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి.. మీ ఎంట్రీలు సాధారణ పోస్టులో 15 రోజుల్లోగా చేరాలి. వెంటనే వ్రాయండి, ఆలస్యం చేయకండి.

**Add:- MANISH BHAVAN,A-1, P.O. Lal Bigha (GAYA)**

Publisher is not responsible for any disputes in this regard

